

హోరాహోరీగా బాక్సింగ్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలోని బాక్సింగ్ కోర్టులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14, 17, 19 బాక్సింగ్ రాష్ట్ర పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండు బాక్సింగ్ రింగుల్లో జరుగుతున్న పోటీలు బుధవారంతో ముగియనున్నాయి. లీగ్ దశ పోటీలు మంగళవారంతో ముగిశాయి. బుధవారం సెమీ ఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు మూడు విభాగాల్లో నిర్వహించనున్నారు. రెండో రోజు పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో క్రీడాకారులు, నగర ప్రజలు హాజరయ్యారు.

రింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపడుతున్న అంగన్వాడీలు

సమ్మెలోకి అంగన్వాడీలు

కలెక్టరేట్, ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద దీక్షలు, ఆందోళనలు ● జనసేన, వామపక్ష పార్టీల మద్దతు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు సమ్మెబాట పట్టారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఫేస్‌యాప్ విధానం రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, తదితర డిమాండ్లపై రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సమ్మెకు దిగారు. కలెక్టరేట్‌తోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద మంగళవారం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన దీక్షలు, ఆందోళనలు చేపట్టారు. పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ సేవలు నిలిచిపోయాయి.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా విజయనగరం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని 11 సెక్టార్లలో 317 కేంద్రాలు బంద్ చేసి, కలెక్టరేట్ వద్ద వర్కర్లు, హెల్పర్లు పెద్దఎత్తున నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షను ఉద్దేశించి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలు కోసం నాలుగేళ్లుగా శాంతియుతంగా నిరసన తెలియజేశామని చెప్పారు. సోమవారం కూడా ప్రభుత్వంతో చర్చలు జరిగినా ఎలాంటి పురోగతీ లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో సమ్మెకు సిద్ధం కావాల్సి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తెలంగాణ కంటే అదనంగా జీతం, గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చడం, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సమ్మెకు సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహనరావు, ఎపి మెడికల్ సేల్స్ అండ్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ రవికుమార్ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాత, శిశు సంరక్షణ కోసం గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు సేవలందిస్తున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడం పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీలు ఒంటరి కాదని, మద్దతుగా ఉంటుందని భరోసాఇచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకులు విశాలాక్షి, శివలక్ష్మి, మంగ లక్ష్మి, సెక్టార్ లీడర్లు లలిత, ప్రసన్న, జయ, ఈశ్వరమ్మ, పార్వతి, సరస్వతి, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ఎస్ కోట ప్రాజెక్టు పరిధిలో గల అంగన్వాడీలు సమ్మె చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్ మాట్లాడారు. సమ్మెకు జనసేన నియోజకవర్గ సీనియర్ నాయకులు వబ్బిన సన్యాసి నాయుడు, జామి మండల అధ్యక్షులు వర్మరాజు, వారధి స్వామినాయుడు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, ప్రాజెక్ట్ లీడర్స్ డి. శ్యామల, కె. వెంకటలక్ష్మి, ఎఐటియుసి నాయకులు వి. మాణిక్యం, బి.సుశీల పాల్గొన్నారు.

చీపురుపల్లి: ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్ వాడీలు మంగళవారం నిరవధిక సమ్మె చేపట్టారు. సమ్మెకు సిఐటియు జిల్లా నాయకులు టివి రమణ, అంబళ్ల గౌరినాయుడు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి బి వరలక్ష్మి పాల్గొన్నారు.

గజపతినగరం: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అనంతరం రోడ్డు మీదుగా బ్రిడ్జి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా గౌరవ అధ్యక్షులు వి లక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఎం సుభాషిని, పి. జ్యోతి, సెక్టార్ నాయకులు నాగమణి, సన్యాసమ్మ, రవణమ్మ, నారాయణమ్మ, వాణి, పద్మ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: బాడంగిలో అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. సమ్మెకు సిఐటియు జిల్లా నాయకులు సురేష్, రైతు సంఘం నాయకులు గోపాల్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు రవణమ్మ, సీత, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కొత్తవలస: పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు సమ్మె చేశారు. వీరికి సిఐటియు కార్యదర్శి గాడి అప్పారావు, సిపిఐ నాయకులు డేగల అప్పలరాజు, జనసేన నాయకులు ఒబ్బిన సన్యాసినాయుడు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తులసి, రెడ్డి శంకరావతి పాల్గొన్నారు.

గరివిడి: స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గరివిడి, చీపురుపల్లి మండలాల అంగన్వాడీ కార్యకర్తల మంగళవారం శాంతియుత ధర్నా చేపట్టారు. ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.

రాజాం: రాజాంలో అంగన్వాడీలు ర్యాలీలు చేపట్టారు. అంగన్వాడీల సమ్మెకు సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామమూర్తి నాయుడు, ఎఐటియుసి జిల్లా నాయకులు నీలకంఠ యాదవ్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.ఉమా కుమారి, దేవి, పార్వతి, సునీత, భారతి, చిన్నమ్మడు, ధవలేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

భోగాపురం: భోగాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీలు నిరసన చేపట్టారు. వీరికి జనసేనపార్టీ నాయకులు లోకం మాధవి, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణవేణి, కొర్లమ్మ, అనిత, చిన్నమ్మలు, వరలక్ష్మి, సుజాత, శ్రీదేవి, జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు పాల్గొన్నారు.

గజపతినగరంలో ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు

గుర్తిస్తారో.. లేదో?

నీటమునిగిన వరిచేను (ఫైల్)

- పంటనష్టం గుర్తింపుపై అన్నదాత అయోమయం
- నీటమునిగిన వరి, పత్తి 2769 ఎకరాల్లోనేనట
- ఇదీ అధికారుల ప్రాథమిక అంచనా

'పంటల నష్టాన్ని ప్రభుత్వ సిబ్బంది సరిగా గుర్తించ గలుగుతారో... లేదో? ప్రభుత్వం కూడా పరిగణనలోకి తీసుకుంటుందో? నిబంధనల పేరిట తిరస్కరిస్తుందో?' అంటూ అన్నదాత అయోమయంలో పడ్డాడు. తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన రైతన్న ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. పంట నష్ట గణనకు ప్రభుత్వం ఎట్టకేలకు ఉత్తర్వులు జారీచేయడంతో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది మంగళవారం క్షేత్ర స్థాయిలోకి దిగారు. దాదాపు ఐదు రోజుల తరువాత పంటనష్టం గుర్తించేందుకు దిగడంతో జరిగిన నష్టాన్ని అధికారులు సరిగా అంచనా వేస్తారా? లేదా? అన్న సందేహంలో రైతులున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు కురిసిన వర్షాలకు జిల్లా అతలాకుతలమైన విషయం విదితమే. వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ప్రధానంగా చేతికందిన వరి జలదిగ్బంధానికి గురైంది. కోసిన కంకులతో తమకు సంబంధం లేదని ప్రభుత్వం చేతులెత్తేసోంది. మరోవైపు కేవలం పంటల ముంపును మాత్రమే వ్యవసాయ శాఖ పరిగణనలోకి తీసుకుని ప్రాథమిక అంచనా వేసింది. జిల్లా అతలాకుతలంగా కాగా కేవలం 2,769.63 ఎకరాలు మాత్రమే ముంపునకు గురైనట్టుగా గుర్తించడం గమనార్హం. ఇందులో వరి 2743.63 ఎకరాల్లో నష్టపోయినట్లు తేల్చారు. మెంటాడ మండలంలో 15 ఎకరాల్లో, నెల్లిమర్ల మండలంలో 11 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు అంచనాకు వచ్చారు. ఈ సమాచారం తెలిసిన రైతులు, రైతు సంఘం నాయకులు విస్తుపోతున్నారు. మునిగిన పంటనే సరిగ్గా గుర్తించలేని ప్రభుత్వం గడిచిన ఐదు రోజుల వ్యవధిలో పూర్తిచేసిన కోతలను, నేలకొరిగిన చేను కాస్త నిలబెట్టడం లేదా యంత్రాలతో అక్కడికక్కడే నూర్పిడి చేయడం వంటివి ఎలా గుర్తిస్తారో? అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు గుర్తించిన పంటల ముంపు మెరకముడిదాం, రేగిడి మినహా మిగిలిన 25 మండలాల్లో ఉన్నప్పటికీ అది అంతంత మాత్రంగానే ఉంది. కేవలం 284 గ్రామాల్లోనే ముంపు నమోదైంది. ఇందులో అత్యధికంగా పూసపాటిరేగ మండల పరిధిలోని 13 గ్రామాల్లో 380, డెంకాడ మండలంలోని 16 గ్రామాల్లో 350 ఎకరాలు, శృంగవరపు కోట మండలంలో 37 గ్రామాల పరిధిలో 263 ఎకరాల్లో పంటల ముంపును గుర్తించారు. అత్యల్పంగా దత్తిరాజేరు మండలంలో 2.53 ఎకరాల ముంపు విస్తీర్ణం నమోదైంది.

మరోవైపు కోతలు పూర్తయిన వరికి నష్టపరిహారం ఇవ్వలేమని ప్రభుత్వం తేల్చిచెప్పిన్న సంగతి తెలిసిందే. రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెబుతున్నా, నాణ్యత పేరుతో ధర తగ్గించడం వంటివి చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. చాలాచోట్ల కొనుగోలుకు నిరాకరించినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదంటూ రైతులు గత అనుభవాలను గుర్తుచేస్తున్నారు. నష్టపరిహారం చెల్లింపునకు ప్రభుత్వం కూడా కఠిన నిబంధనలు విధించింది. ఈ నేపథ్యంలో సాక్ష్యాలు చెరిగిపోయిన తరువాత దిగుతున్న ప్రభుత్వ సిబ్బంది పంటనష్టాన్ని సరిగా గుర్తించాలని రైతులు కోరుతున్నారు.

వరి పంటనష్టం ప్రాథమిక అంచనా

మండలం	గ్రామాలు	పంటనష్టం (ఎకరాల్లో)
బాడంగి	10	13
భోగాపురం	11	224
బొబ్బిలి	10	50
బొండపల్లి	13	36
చీపురుపల్లి	14	42
దత్తిరాజేరు	7	2.53
డెంకాడ	16	350
గజపతినగరం	9	87
గంట్యాడ	9	261
గరివిడి	9	32
గుర్ల	4	25
జామి	13	39
కొత్తవలస	15	140
లక్కవరపుకోట	17	85
మెంటాడ	15	65.5
నెల్లిమర్ల	12	130
పూసపాటిరేగ	13	380
రాజాం	4	92
రామభద్రపురం	6	108.2
శృంగవరపుకోట	37	263
సంతకవిటి	9	150
తెర్లాం	8	46
వంగర	5	14.4
వేపాడ	4	17
విజయనగరం	14	91
మొత్తం	**284**	**2743.63**

ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఉద్ఘాటించారు. మంగళవారం నగరంలోని 4, 5, 6, 7 డివిజన్లకు సంబంధించిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంజూరు చేశారు. జమ్ము ప్రాంతంలో సిఆర్‌నగర్ సమీపంలో పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. నాలుగో డివిజన్‌లో 115 మందికి, ఐదో డివిజన్‌లో 316, ఆరో డివిజన్‌లో 239 మంది, ఏడో డివిజన్‌లో 412 మంది.. మొత్తం 1,082 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా, పూర్తి పారదర్శకంగా పథకాలను అందించడం వల్ల నేరుగా ప్రజలకు ప్రతీ పథకం అందుతుందని తెలిపారు. నగరంలో గుంకలాం, సారిక, గాజులరేగ ప్రాంతాల్లో 20 వేలకు పైబడి ఇళ్ల పట్టాలను మంజూరు చేసినట్లు వివరించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రకటనలే తప్ప ఆచరణ సాధ్యం కాలేని అనేక పథకాలను చెప్పి చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టారని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఎఎంసి చైర్‌పర్సన్ శశిభార్గవి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ బంగారునాయుడు, వైసిపి మండల అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, జోనల్ ఇన్‌ఛార్జులు బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యం

గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. చెల్లూరులోని రైతు భరోసా కేంద్రాన్ని, సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ఆరంభించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపిపి మామిడి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి కెల్లా శ్రీనివాసరావు, ఎఎంసి చైర్‌పర్సన్ శశిభార్గవి, పిఎసిఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాథ్, అప్పల కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలోని నాలుగు డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులకు మేయర్ విజయలక్ష్మి శంకుస్థాపనలు చేశారు. మంగళవారం నాలుగో డివిజన్‌లో రూ.30.50 లక్షలతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ రెడ్డికి ఓటమి భయం

టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరంకోట

ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటమి భయం వల్లే వైసిపి అభ్యర్థులను మార్చుతున్నారని తెలిపారు. సోమవారం ప్రకటించిన 11 మంది ఇన్‌ఛార్జుల్లో ఒక్కరూ గెలిచే పరిస్థితి లేదన్నారు. నాయకులను మార్చినంత మాత్రాన జగన్ రెడ్డి తలరాత మారదని, ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి పాపం పండిందని చెప్పారు. జగన్ రెడ్డి ఇన్‌ఛార్జులను మార్చుతున్నారు, కానీ ప్రజలు ఏకంగా సిఎంనే మార్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఎద్దేవాచేశారు. జగన్ రెడ్డి చేస్తున్న అవినీతి, అక్రమాలు, ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు.

లోకేష్‌ని కలిసిన నాగార్జున

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున పాల్గొన్నారు. పాదయాత్ర ఉత్తరాంధ్రలో ప్రవేశించిన సందర్భంగా పాయకరావుపేట వద్ద ఆయన లోకేష్ కలిసి, సంఘీభావం తెలియజేశారు.

నారా లోకేష్‌తో కలిసి నడుస్తున్న నాగార్జున

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జనసేన నేత గురాన అయ్యలు

ప్రజాశక్తి-జయనగరం టౌన్

తుపాను వల్ల పంటలు నష్టపోయి రైతులను ఆదుకోవాలని జనసేన నేత గురాన అయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను కారణంగా పంటలు నష్టపోయి రైతులు ఆపదలో ఉంటే ప్రభుత్వం 'ఆదుకుందాం రా..' అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారంతోపాటు సబ్సిడీపై విత్తనాలు, పురుగుల మందులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట పొలాల్లో నీరు, రైతుల కంట కన్నీళ్లు ఉంటే కనీసం ఈ ప్రభుత్వం భరోసా కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటివరకు పంటనష్టం అంచనాలు వేయక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి పంటనష్ట అంచనాలు వేయాలని, ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ధర్నా చేస్తున్న ఎన్ఎంయు నాయకులు, ఆర్‌టిసి కార్మికులు

ఎన్ఎంయు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం విజయనగరంలోని ఆర్‌టిసి గ్యారేజీ వద్ద ఎన్ఎంయు ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు డిపో అధ్యక్షులు రాఫెల్ మాట్లాడుతూ ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం తర్వాత పేరుకుపోయిన అనేక సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అన్ని జోన్లలో ఒకే విధమైన పరిపాలన అమలు కావడం లేదని చెప్పారు. 1/2019 సర్కిల్ అమలు చేయాలని, అన్ని ఆస్పత్రుల్లో ఇహెచ్ఎస్ సదుపాయం కల్పించాలని, సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేయాలని, ఉద్యోగులపై యాజమాన్యం కక్ష సాధింపు చర్యలు విడనాడాలని డిమాండ్ చేశారు. వర్క్‌షాప్ వద్ద చేపట్టిన ధర్నాలో విశాఖ జిల్లా కార్యదర్శి నీలకంఠం మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో విశాఖ జిల్లా అధ్యక్షులు గండి రామకృష్ణ, డిపో అధ్యక్షులు బి.రామారావు, కార్యదర్శి కె.చంద్రమౌళి, కెవిఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నదానం

విజయనగరం టౌన్ : పైడితల్లమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన మహా అన్నదాన కార్యక్రమాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ విజయలక్ష్మి ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రారంభమైన అన్నదాన కార్యక్రమం నాలుగు గంటల వరకు జరిగింది. వేలాదిగా జనం అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఎసి సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల సంతృప్తే లక్ష్యం

విబిఎస్‌వైలో పిఐబి ఎడిజి ధీరజ్ కకాడియా

ప్రజాశక్తి-గంట్యాడ

ప్రజల సంతృప్త స్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయడమే లక్ష్యమని పిఐడి అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ధీరజ్ కకాడియా తెలిపారు. గంట్యాడ మండలం తాటిపూడి వద్ద మంగళ వారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధీరజ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన, కిసాన్ సమ్మాన్ యోజన, పోషణ్ అభియాన్, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, ఆయుష్మాన్ భారత్, తదితర పథకాలను వివిధ వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. పౌరులు తమ హక్కులతోపాటు బాధ్యతలను కూడా గుర్తించాలని సూచించారు. అనంతరం జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన యాత్ర ప్రగతిని, లక్ష్యాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ఆయా శాఖల ప్రతినిధులు వివరించారు. గ్రామంలోని సుమారు 180 మంది మహిళలకు డిఆర్‌డిఎ వైకెపి ద్వారా రూ.82.73లక్షల విలువైన మెగా చెక్కును అందజేశారు. అనంతరం స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో విబిఎస్‌వై రాష్ట్ర నోడల్ అధికారి బి.తారకప్రసాద్, ఎంపిపి జైహింద్‌కుమార్, సర్వేశాఖ ఎడి త్రివిక్రమరావు, సిబిసి ఎడి షఫీమహ్మద్, ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ నగేష్, టిబి కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ రాణి, హౌసింగ్ డిఇ రంగారావు, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు, సర్పంచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎడిజి ధీరజ్ కకాడియా

అందరి సహకారంతో నగరాభివృద్ధి

విజయనగరం టౌన్ : అందరి సహకారంతో నగరాభివృద్ధి సాధ్యమవుతుందని కమిషనర్ శ్రీరాములు నాయుడు అన్నారు. మంగళవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నెలవారీ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ప్రత్యేక వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ తిరుమల ప్రసాద్, డాక్టర్ కృష్ణశాంతి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో జిల్లాకు పతకాలు

విజయనగరం టౌన్ : విశాఖలో జరిగిన కరాటే పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులకు పలు పతకాలు లభించాయి. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులు పాల్గొనగా అందరికీ పతకాలు లభించాయి. తమ కళాశాల క్రీడా ప్రాంగణంలో శిక్షణ పొంది పతకాలు లభించడం పట్ల సాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె.శశిభూషణరావు, ప్రిన్సిపల్ సాయి దేవమణి, కోచ్ కానూరు సంతోష్ అభినందనలు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

విజయనగరం టౌన్ : ధర్మపురిలో ఎస్‌సి కాలనీలో అంబేద్కర్ విగ్రహాన్ని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర ఆవిష్కరించారు. విగ్రహాన్ని ఏర్పాటుచేసిన సిరికి ఆ కాలనీవాసులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, ప్రధాన కార్యదర్శి జాకీర్ హుస్సేన్, అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి సీతబాబు, మలిజెడ్డి అప్పారావు, సభాధ్యక్షులు, జిల్లా కన్వీనర్ కెల్ల భీమారావు, లోపింటి లక్ష్మణరావు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌సిసి కేడెట్లతో సీతం కళాశాల యాజమాన్య ప్రతినిధులు

చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గాజులరేగలో మంగళవారం చిరుధాన్యాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సిసి కేడెట్లు స్థానికులకు చిరుధాన్యాల లడ్డు, రొట్టెలను, పండ్లను పంపిణీ చేశారు. చిరుధాన్యాల పోషక ప్రయోజనాలను గూర్చి వివరించారు. కార్యక్రమంలో సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, వైస్ ప్రిన్సిపల్ సి.హెచ్.వెంకటలక్ష్మి, క్యాప్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ మజ్జి వరలక్ష్మి, లెఫ్టినెంట్ ఎస్.ప్రశాంత్, సిఎస్ఒ కె.సత్యనారాయణ, బి.ఎస్.బోడెలే పాల్గొన్నారు.

మరమ్మతులు వేగవంతం

ప్రజాశక్తి-బాడంగి

రైల్వే మూడో లైన్ పనులు చేపడుతుండటంతో దత్తిరాజేరు రక్షిత తాగునీటి పథకం నుంచి పలు గ్రామాలకు నీటి సరఫరా నిలిచి పోయింది. బాడంగి, దత్తిరాజేరు మండలాల్లో డొంకినవలస, చౌదంతి వలస, కోరపుకొత్తవలస తదితర గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో మరమ్మతులు శరవేగంగా చేపడుతున్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తిచేసి, నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని కాంట్రాక్టరు పోలా మహేశ్వరరావు తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న కాంట్రాక్టరు

డ్వాక్రా సంఘాలు 'ఎ' గ్రేడ్‌లో ఉండాలి

నెల్లిమర్ల: డ్వాక్రా సంఘాలు ఎ గ్రేడ్‌లో ఉండాలని పీడీ కల్యాణ చక్రవర్తి అన్నారు. మంగళ వారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయం లో నెల్లిమర్ల, గుర్ల మండలాలకు చెందిన వివోలు, సిబ్బందికి ఎవియా కో ఆర్డినేటర్ బంగారుపు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలన్ని 'ఎ' గ్రేడ్‌లో ఉండాలని, వసూళ్లు శత శాతం సాధించాలని సూచించారు. అన్ని రుణాలను టార్గెట్ ప్రాప్తికి ఈ 15 రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. ఇచ్చిన రుణాలు సద్వినియోగం చేసుకుని జీవనోపాధికి ఉపయోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం సావిత్రి, డిపిఎంఎల్‌హెచ్ ఎం.జయశ్రీ, ఫైనాన్స్ డిపిఎం జె.లక్ష్మునాయుడు, స్త్రీనిధి ఎజిఎం ఉమామహేశ్వరరావు, లైవ్ స్టాక్ డిపిఎం డివిఐ ఎస్ఎన్ మూర్తి, హెడ్ డిపిఎం కె. గీత పాల్గొన్నారు.

యువగళం సభ విజయవంతం చేయాలి

శృంగవరపుకోట: భోగాపురం వద్ద నిర్వహించనున్న యువగళం పాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ కోరారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతంగా చేయాలన్నారు. జనవరి 27న ప్రారంభమై నిర్విరామంగా సాగుతున్న యువగళం పాదయాత్ర డిసెంబర్ 17న విశాఖలో పూర్తి చేసి 20న భోగాపురం వద్ద భారీ బహిరంగ సభతో ముగియనుందన్నారు. ఈ సభలో నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు లగుడు రవికుమార్, గొరపల్లి రాము, గుమ్మడి భారతి, జనపురెడ్డి ఈశ్వర్రావు, ఇప్పక త్రివేణి, బాలకృష్ణ, జగ్గారావు, జుత్తాడ రామసత్యం తదితరులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలన

కొత్తవలస: మండలంలోని గొల్లలపాలెంలో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను ఒరిస్సా బృందం మంగళవారం పరిశీలించింది. రీజనల్ కో ఆర్డినేటర్ ప్రకాష్ పాల్గొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులను నవధాన్యాల ద్వారా ఏ విధంగా తీసుకుంటున్న అంశాలను బృందానికి వివరించారు. రబీలో జీవవైవిధ్య పంటలు వేయడం వల్ల అధిక ఆదాయాన్ని రైతులు ఏ విధంగా పొందవచ్చును, సారం ఏ విధంగా పెంచాలి, పురుగుల యాజమాన్యం గురించి వారికి వివరించారు. ఆంధ్రప్రదేశ్లో ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా సాగుచేస్తున్న పంటలు బాగున్నాయని తిరిగి రాష్ట్రానికి వెళ్ళినప్పుడు ఖచ్చితంగా ప్రకృతి వ్యవసాయంలో పంటలు సాగు చేస్తామని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ మెర్సీ పాల్గొని ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం (ఫఫ్) ఎ.వెంకట రమణ, వివిఎ, ఎపిసిస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడా సామగ్రి పంపిణీ

శృంగవరపుకోట: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల సామగ్రిని మంగళవారం ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుబ్బలక్ష్మి అందించారు. గ్రామ సచివాలయాలన్నింటికీ, ఆ పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులను ఉద్దేశించిన కిట్లు పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సంతోషికుమారి, నాయకులు శంకర్, పంచాయతీ విస్తరణాధికారి లక్ష్మీ, పలువురు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జగనే రావాలి

వేపాడ: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మళ్లీ సిఎంగా జగనే రావాలని ఎంపిపి దొగ్గ సత్యవంతుడు తెలిపారు. మండలంలోని కుంపల్లి గ్రామంలో మంగళవారం ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సంక్షేమ పథకాలు బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్పర్సన్ కస్తూరి, ఎస్ అరుణ, గ్రామ సర్పంచ్, మండల పార్టీ అధ్యక్షుడు ఎం జగ్గు బాబు, జిల్లా జోనల్ కమిటీ చైర్మన్ ఎం సత్యనారాయణ, కోఆపరేటివ్ అధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు ఎస్ వెంకటరావు, ఎంపిడిఒ పట్నాయక్, ఇఒపిఆర్డి ఉమ, పంచాయతీ కార్యదర్శి కమల, కెఆర్‌పేట సర్పంచ్ సిహెచ్ బాలాజి, గ్రామ సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

డెంకాడ: మండలంలోని మోదవలస సమీపంలో ఈ నెల 10న జాతీయ రహదారి 16 పక్కన గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండటంతో స్థానికులు విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి ఆ వ్యక్తి మృతి చెందాడు. విఆర్ఒ ఫిర్యాదు మేరకు ఎస్ఐ యు. మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి 65 నుంచి 70 సంవత్సరాలు ఉంటాయని, తెలుపు రంగు బనియన్, చిన్నచిన్న గీతలు కలిగిన తెలుపు నీలం షర్టు, ఆకుపచ్చ గీత కలిగిన లుంగీ పంచి ధరించి ఉన్నాడని, వివరాలు ఎవరికైనా తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేపట్టండి

దత్తిరాజేరు: ఖరీఫ్ సీజన్‌లో అధిక పెట్టుబడులతో కూడిన వ్యవసాయ సాగు చేపట్టిన రైతులకు మిల్లర్ల సహకరించాలని, త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేపట్టాలని ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు మిల్లర్లకు ఆదేశించారు. మండలంలో దత్తిరాజేరు రైతు భరోసా కేంద్రం వద్ద కొనుగోలు ధాన్యం కేంద్రాన్ని ఎంపిపి మంగళవారం ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మిల్లర్ల యాజమాన్యంతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తుఫాను కారణంగా రైతులు అష్ట కష్టాలతో నానా ప్రయాసలు పడి పంటను కాపాడుకున్నారని, పంట అమ్ముకునే సమయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తహశీల్దార్ రమేష్, సిఎస్‌డిటి ధనలక్ష్మి, వ్యవసాయ అధికారి అనూరాధ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు, జిల్లా కమిటీ సభ్యులు కడు బండి రమేష్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు రాపాక కృష్ణార్జున, పలువురు మిల్లు యజమానులు, పలు గ్రామాల సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

కొలతలను అడ్డుకున్న ప్రజలు

బొబ్బిలి: మున్సిపాలిటీలోని గొల్లపల్లి శ్రీదాడితల్లి కాలనీలో దాడితల్లి కళ్యాణ మండపం కోసం ఉంచిన రిజర్వ్ స్థలంలో కొలతలుండి అధికారులు పట్టాలు ఇవ్వాలని. లబ్ధిదారులకు ఇక్కడ స్థలాలు ఇవ్వాలనుకుంటున్న అధికారులు కొలతలు వేసేందుకు వెళ్లగా కాలనీ ప్రజలు మంగళవారం అడ్డుకున్నారు. దాడితల్లి కళ్యాణ మండపం కోసం ఉంచిన స్థలంలో పట్టాలు ఇవ్వడం అన్యాయమని మాజీ కౌన్సిలర్ కాకి వెంకటరావు అన్నారు. కళ్యాణ మండపం కోసం ఉంచిన స్థలంలో ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పట్టాలు రద్దు చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి- డెంకాడ

స్టాళ్లను పరిశీలిస్తున్న అధికారులు

మండలంలోని డి. తాళ్లవలసలో కేంద్ర అధికారులు మంగళవారం పర్యటించారు. గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న వివిధ పథకాలు, వివిధ శాఖల ఏర్పాటు చేసిన స్టాళ్లను కేంద్ర పిజిబి అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ దేవరాజు కాడియార్, అసిస్టెంట్ డైరెక్టర్ నవీనమోహన్ సందర్శించి పరిశీలించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన మెడిసిన్లను పంపిణీ చేశారు. వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న చెక్కులు, కార్డులు, ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పని పూర్తి చేసుకున్న వేతనదారులను, ఎక్కువ పంటలు పండించిన రైతులను, సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపా రాణి, ఎపిఎం నారాయణలక్ష్మి, ఎపిఒ వెంకటరమణ, సర్పంచ్ త్రిమూర్తులు అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమంతోనే సంతోషం

ప్రజాశక్తి - బొండపల్లి

పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం ద్వారా సంతోషంగా ఉండాలన్నదే సిఎం జగన్ మోహన్ రెడ్డి అభిమతమని ఎంపిపి చల్ల చలం నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని కొండకిండాం గ్రామంలో ఎంపిడిఒ వై.రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ఈ రాష్ట్రానికి జగనే ఎందుకు కావలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇఒపిఆర్డి సిహెచ్ సుగుణాకర రావు గ్రామంలో లబ్ధిదారులకు అందచేసిన సంక్షేమ వివరాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొడ్డు చిన్నంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశ రావు, జెసిఎస్ మండల కన్వీనర్ పల్లి రఘు, సర్పంచ్లు ఈదుబిల్లి కృష్ణ, బుంగ దేముడు, బంద నారాయణమ్మ, ఎంపిటిసి తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వంటా వార్పును జయప్రదం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని కోరుతూ ఈనెల 14,15న విజయనగరం కలెక్టరేట్ వద్ద జరగనున్న వంటావార్పును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఆశ యూనియన్ అధ్యక్షులు ఎల్.శాంతి కోరారు. వంటావార్పులో పాల్గొనేందుకు ఆ రెండు రోజులు విధులు బహిష్కరిస్తున్నట్లు సి.హెచ్.సి పిపి యూనిట్ వైద్యాధికారి సంతోషిణికు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జామి: ఆశా వర్కర్స్‌కి కనీస వేతనాలు చెల్లించాలని, పని భారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, సంక్షేమ పథకాలు అమలుచేయాలని, ఆశా నియామకాల్లో రాజకీయ జోక్యం తొలగించాలన్న డిమాండ్లతో ఈ నెల 14,15 తేదీల్లో జిల్లా కలెక్టరేట్ వద్ద చేపడుతున్న 36 గంటల ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం జామి, అలమండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులను కలిసి ఆశా కార్యకర్తల సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో

బొబ్బిలి: నిరసన చేపడుతున్న ఆశాలు, సిఐటియు నాయకులు

ఆషాడే సందర్భంగా కొట్టాం పిహెచ్‌సి వైద్యాధికారి జె.హారికకు ఆశ వర్కర్లు 36 గంటల ధర్నాకు సంబంధించిన సమ్మె నోటీసును మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, బి.విమల, డి. సామమ్మ, ఆర్. రవణమ్మ, టి. విజయ, ఆర్ శ్రావణి, ఆర్‌వి రమణమ్మ, ఎం. గౌరీశ్వరి, పి. రవణమ్మ, జి. గురమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: ఆశాల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆశాలు మంగళవారం పిరిడి పిహెచ్‌సి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు తదితర డిమాండ్ల సాధనకై ఆశా వర్కర్స్ డిసెంబర్ 14, 15 కలెక్టరేట్ 36 గంటలు నిరసన తెలియజేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పి. రాధ, రవణమ్మ, కృష్ణవేణి ఆశాలు పాల్గొన్నారు.

రాజాం: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14, 15 తేదీల్లో కలెక్టరేట్ వద్ద జరుగు 36 గంటల నిరసన ధర్నాలో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రాజాంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం బొద్దాం, పొగిరి, రాజాం పిహెచ్‌సిల్లో అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పార్వతీ, రవణమ్మ, సూర్యమణి, చిన్నముడు, తులసి, రత్నం, పాల్గొన్నారు.

ఘనంగా ఆశా దినోత్సవం

వేపాడ: మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో ఆశాల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆసుపత్రి అధికారులు డాక్టర్ బి రవికుమార్, పవన్ కుమార్ పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో ఆశాలు నిర్వహించే విధులు బాధ్యతలు గురించి వివరించారు. ఇంత వరకూ ఆశాల నిర్వహించిన విధులకు సంబంధించిన నివేధికలను పరిశీలన చేశారు. లింగ వివక్షత పై ఆశాలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆశలకు చీరలు, తువ్వాళ్లు, గాజులను జిల్లా అధికారుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారిని ఏ ధరణి, సిహెచ్‌ఒ ఆంజనేయులు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా పరిషత్తు చైర్మన్ శ్రీనివాసరావు

మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి- గరివిడి

జగనన్న ప్రభుత్వం చేస్తున్న మంచిని గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో మంగళవారం సాయంత్రం శ్రీసీతారామ కళ్యాణ మండపంలో చీపురుపల్లి నియోజకవర్గం వైసిపి సోషల్ మీడియా ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం మాట మీద నిలబడి, కుల, మత, ప్రాంతం, పార్టీ భేదం చూడకుండా పథకాలు అందరికీ వర్తించేలా పనిచేస్తుందన్నారు. కేవలం అర్హత ప్రామాణికంగా చూసి పథకాలు ఇచ్చి ఆదుకుంటున్న మంచిని గ్రామ స్తాయిలోకి తీసుకెళ్లవలసిన అవసరం, బాధ్యత సోషల్ మీడియాకు ఉందన్నారు. ప్రతి పక్షాలను, పచ్చ మీడియాను ధీటుగా ఎదుర్కోవలసిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గం వైసిపి నాయకులు, జిల్లా సోషల్ మీడియా పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - కొత్తవలస

మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని యువత విరివిగా క్రీడల్లో పాల్గొవాలని కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, కంపెనీ సీనియర్ మేనేజర్ ప్రభాత్ మోహన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో శారద మెటల్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన క్రీడల పోటీలను సర్పంచ్ ప్రారంభించారు. శారద కంపెనీ యాజమాన్యం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది వాలీబాల్ క్రీడలను ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ క్రీడలను కొత్తవలస వాలీబాల్ క్రీడల ప్రతినిధులు కే. కృష్ణంరాజు, గవర సూరిబాబు, ఎల్‌జిఎన్ కుమార్, పాల్తేటి శ్రీను, బాల, నందగోపాల్, రాజు నాయుడు, కిరణ్, రామస్వామి తదితరులు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ క్రీడల్లో 41 టీమ్‌లు పాల్గొన్నాయి. శారద యాజమాన్యం ఒక్కొక్క టీమ్‌కు

వాలీబాల్ క్రీడలను ప్రారంభిస్తున్న సర్పంచ్

వాలీబాల్, నెట్, టీ షర్ట్ అందించింది. మూడు రోజులపాటు జరిగే ఈ క్రీడల్లో ప్రథమ బహుమతిగా లక్ష రూపాయలు, రెండవ బహుమతిగా 50వేలు, మూడవ బహుమతిగా 12 వేలు, నాలుగవ బహుమతిగా రూ.10 ప్రైజ్ మనీ కింద అందించనున్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ నుంచి శంకర రావు, సంతోష్, వైసిపి నాయకులు పిఎస్ఎన్ పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు ప్రచారం

ప్రజాశక్తి - భోగాపురం

రాజకీయంగా ఎదుర్కోలేక అధికార పార్టీ నాయకులు పత్రికలో తమపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యన్నారాయణ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులు నుంచి అధికార పార్టీ పత్రికలో తనతో పాటు తన సోదరుడు బంగార్రాజుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను భూములను పక్కాగా కొనుగోలు చేసినప్పటికి అక్రమదారిలో కొనుగోలు చేసినట్లు ప్రచారం చేస్తున్నారని గుర్తు చేశారు. పోలిపల్లి రెవెన్యూ పరిధిలో రాలి నర్సింగరావు, ఓదూరు అప్పయ్య మాజీ సైనికలు కావడంతో సర్వే నెం.27లో ప్రభుత్వం వారికి భూమిని కేటాయించిందని, ఆ భూమిని అమ్ముకునేందుకు రెవెన్యూ అధికారులు ఎన్‌ఒసి ఇవ్వడంతో తాను పక్కాగా 2006లో కొనుగోలు చేసుకున్నాని చెప్పారు. గతంలో జరిగిన జాతీయరహదారి విస్తరణలో నష్ట పరిహారం రూ.10లక్షలు తాను తీసుకున్నట్లు చెబుతున్నారు. కాని అప్పట్లో ఆర్‌డిఒ కార్యాలయం నుంచి పరిహారానికి సంబంధించిన నోటీసులు రాలి నర్సింగరావు,

తన వద్ద ఉన్న ఆధారాలను చూపిస్తున్న సత్యనారాయణ

ఓదూరు అప్పయ్యకే ఇచ్చారని అన్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తనవద్దనున్నాయని బహిరంగ చర్చకు ఎక్కడకు వచ్చినా సిద్దంగా ఉన్నామని సవాల్ విసిరారు. నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర ముగింపు సభను తమ గ్రామమైన పోలిపల్లి సమీపంలో నిర్వహిస్తున్నామని అక్కసుతో రాజకీయంగా దెబ్బతీసేందుకు ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు ఆపకపోతే న్యాయపరంగా కోర్టును ఆశ్రయిస్తామని, అవసరమైతే పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో కొండవెలగాడ ప్రతిభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండ వెలగాడ క్రీడాకారులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. మంగళవారం రాజమండ్రి ఆదికవి నన్నయ్య యునివర్సిటీలో సౌత్ జోన్ ఇంటర్ యునివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ స్త్రీ, పురుష ఛాంపియన్ షిప్ పోటీల్లో కొండ వెలగాడ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి బంగారు, రజిత, కాంస్య పతకాలు సాధించారు. ఈ నెల 9 నుంచి 12వరకు జరిగిన పోటీల్లో బి. రాజేశ్వరి 45కిలోల విభాగంలో స్నాచ్ 69, జర్క్ 81మొత్తం 150కిలోల బరువెత్తి బంగారు పతకం సాధించింది. ఎస్. పల్లవి 64కిలోల విభాగంలో స్నాచ్ 84, జర్క్ 105మొత్తం 189కిలోలు బరువులెత్తి బంగారు పతకం, సిహెచ్ లక్ష్మీ 81 కేటగిరీలో స్నాచ్ 83, జర్క్ 108మొత్తం 191కిలోల బరువులెత్తి బంగారు, ఆర్. గాయత్రి 87కేటగిరీలో స్నాచ్ 76, జర్క్ 100మొత్తం 176కిలోల బరువెత్తి బంగారు పతకం సాధించారు. బి.నాని 71 కేటగిరీలో స్నాచ్ 80, జర్క్ 106మొత్తం 186 కిలోల బరువెత్తి రజతం, బి.

పతకాలు సాధించిన క్రీడాకారులు

చంద్రిక 49 కేటగిరీలో స్నాచ్ 72, జర్క్ 90మొత్తం 162 కిలోల బరువెత్తి కాంస్యం, కె.వి. శివరాం 81కేటగిరీలో స్నాచ్ 121, జర్క్ 162 మొత్తం 283కిలోల బరువెత్తి కాంస్యం సాధించారు. వీరిని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బి. లక్ష్మీ, సెక్రటరీ చల్లా రాము, కోచ్ శ్రీనివాస్, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

సక్రమంగా విధులు నిర్వర్తించకపోతే రికవరీ

ప్రజాశక్తి - గుర్ల

సాంకేతిక సహాయకులు సక్రమంగా విధులు నిర్వహించకపోతే రికవరీలు చెల్లించాల్సి వస్తుందని ఉపాధి హామీ పీడీ ఉమాపరమేశ్వరి అన్నారు. మంగళవారం మండల కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిచారు. ప్రతి పంచాయతీకి సంభందించిన పనుల నివేధికపై పీడీ తనిఖీలు నిర్వహించారు. మండలంలో పెదబంటుపల్లి, కెల్ల, ఆనందపురం గ్రామాలలో ఎవెన్యూ ప్లానిటేషన్ జరిగినప్పటికి కొన్ని మొక్కలు చనిపోయినట్లు సామాజిక తనిఖీలో తేలడంతో వాటి స్తానంలో కొత్త మొక్కలు నాటాలని పీడీ ఆదేశించారు. చెరువుల వద్ద పనులు జరిగిన ప్రదేశాలలో నేమ్ బోర్డ్లు లేనిచోట పది రోజులలో వాటిని ఏర్పాటు చేయాలన్నారు. లేని ఎడల రికవరీ చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వేతనాలు చెల్లిపులు

రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

విషయంలో తేడాలు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలాస నియోజకవర్గ వైసిపి పరిశీలకులు కెవి సూర్యనారాయణ రాజు, జెడ్‌పిటిసి సీర అప్పల నాయుడు, డిఎల్‌డిఎ చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపి తోట తిరుపతి రావు, ఎంపిడిఒ కల్యాణి, సామాజిక తనిఖీ బృందం, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై నేరాల్లో ఎపికి మొదటి స్థానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తెలుగు మహిళా జిల్లా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి

మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఘటనల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం సిగ్గుచేటని టిడిపి జిల్లా మహిళా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి అన్నారు. మంగళ వారం ఆమె తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ మహిళలకు భద్రత, రక్షణ కల్పించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు. విస్తీర్ణంలోనూ, జనాభాలోనూ మనకంటే పెద్దదైన మహారాష్ట్ర ఈ అంశంలో రెండో స్థానంలో ఉండగా ఎపిలో అక్కడి కంటే ఎక్కువగా ఈ నేరాలు చోటుచేసుకున్నాయన్నారు. ఐపిసిలోని సెక్షన్ 509 కిందకు వచ్చే ఈ తరహా నేరాలు గతేడాది దేశవ్యాప్తంగా

8,972 నమోదు కాగా వాటిలో 3,145 (35.05 శాతం) ఎపిలోనే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. జాతీయ స్థాయిలో ఈ నేరాల రేటు 1.3 శాతం కాగా ఎపిలో ఏకంగా 11.9 శాతంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యభిచారం కోసం మహిళల అక్రమ రవాణా అత్యధికంగా జరుగుతున్న రాష్ట్రాల జాబితాలో ఎపి మూడో స్థానంలో నిలవడం అవమానకరమన్నారు. జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్సీఆర్బీ) విడుదల చేసిన వార్షిక నేర నివేదిక-2022 ఈ వివరాలు వెల్లడించిందని చెప్పారు.

నేడు బానాదిలో గౌరీ పరమేశ్వరుల నిమజ్జనం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో బుధవారం గౌరీ పరమేశ్వరుల నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నామని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు అన్నారు. అదే రోజు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని సాయంత్రం 5గంటలకు గౌరీ పరమేశ్వరులను పురవీధులలో ధూప దీప నైవేద్యాలతో సాము గరిడీలు, తప్పెటగుళ్ళు, కోబ్రా డాన్సులు, మందుగుండు సామాగ్రితో నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. రాత్రి 9 గంటలకు రేలారేరేలా జానపద గీతాల కార్యక్రమం, బాలనాగమ్మ బుర్రకథ, గాజువాకకు చెందిన డాన్స్ బేబీ డాన్స్, సీతారామాంజనేయ కోలాటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఎంపిటిసి, టిడిపి మహిళా సంఘాలు ఎవేర్నెస్ కమిటీ చైర్‌పర్సన్ గొంప తులసి, గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు, యువకులు సహకారంతో ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు వెంకటరావు తెలిపారు.

క్రీడల్లో యువత రాణించాలి

బొబ్బిలి: క్రీడలలో యువత రాణించాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీలకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం-ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 15 నుంచి 2024 ఫిబ్రవరి 3 వరకు క్రికెట్, బాస్కెట్ బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలలో పాటు యోగ, టెన్నికాయిట్, మూడు కిలోమీటర్ల మారథాన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణరావు, గొలగని రమాదేవి, పట్టణం జె.సి.యస్ కన్వీనర్ రేజేటి విస్సు, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, టిపిఆర్ఓ జగన్మోహన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు

జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

రైతులు అన్ని సీజన్‌లలో వేసే పంటలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఎడిఎ యం.శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం ఆయన మెట్టవలస, కొత్త పెంట తదితర గ్రామాల్లో పలు వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ప్రతి రైతు భూసారం, వేయాల్సిన పంట, సీజన్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయా పంటలకు వచ్చే తెగుళ్ల పై పలు సూచనలు చేశారు.

సంక్షేమమే ధ్యేయంగా ముందుకు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పనిచేస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని చల్లవానితోటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హులైన వారందరకీ పథకాలు అందాయని వారు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కోసం పాటు పడుతున్న ఈ ప్రభుత్వాన్ని ఈ ముఖ్యమంత్రిని, ఎమ్మెల్యేగా తనను ఓటు వేసి గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు అల్లాడ సత్యనారాయణ

మాజీ ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

మూర్తి, ఎన్. సత్యనారాయణరాజు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, సర్పంచ్ పతివాడ వరలక్ష్మి, కుమిలి పిఎసిఎస్ చైర్మన్ పతివాడ శ్రీను, ప్రజా ప్రతినిధులు మహంతి లక్ష్మణరావు, జి. సురేష్‌రెడ్డి, టి. సీతారాం, డి. గణేష్, చాపల సత్తిబాబు, పి. అప్పడుదొర, ఎంపిడిఒ రాధిక, ఇఒపిఆర్‌డి శ్రీనువాసరావు తదితర అధికార్లు పాల్గొన్నారు.

పతివాడను పరామర్శించిన బడ్డుకొండ: చల్లవానితోటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తిరుగుతుండగా మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామి నాయుడు గృహం వద్దకు వెళ్లి పతివాడను ఎమ్మెల్యే బడ్డుకొండ పరామర్శించారు. ఎందుకు వచ్చారు. ఎలా ఉన్నారు అన్న కుశల ప్రశ్నలు అనంతరం ఇరువురు చలోక్తులు ఇసురుకొని అందరిని నవ్వించారు. ఏ సందర్భంలో కలసినా వీరిద్దరి మధ్య హాస్యాస్పదమైన మాటల యుద్ధం జరుగుతుందని సంగతి అందరికీ తెలిసిందే. తాజాగా వీరి కలయిక రాజకీయాలు వేరు, మానవ సంబందాలు వేరని మరోసారి నిరూపించి ప్రశంసలు పొందారు.

రాజాం: నిరసన ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

భోగాపురం : అంగన్వాడీలతో మాట్లాడుతున్న మాధవి

చీపురుపల్లి: మాట్లాడుతున్న సిఐటియు నాయకులు టివి రమణ

ఎస్‌కోట: సమ్మెలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి సురేష్

జిల్లా వ్యాప్తంగా మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యలను పరిష్కరించాలని నిరసనలు చేపట్టారు. పలు చోట్ల ర్యాలీలు చేశారు. మరి కొన్న చోట్ల ధర్నాలు చేపట్టారు. తమకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఒకేసారి సమ్మెలోకి దిగడంతో జిల్లా వ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి.

కొత్తవలస: సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT : VIZIANAGARAM
I.A.543/2022 in F.D.I.A. 764/2018 in O.S.467/2012

Between:
Gurajada Madhusudana Rao ...Petitioner/2nd Defendant
And
Gurajada Venkata Lakshmi & 2 others ...Respondents/Plaintiffs
Gurajada Meenakshi & 3 others ...Respondents/Defendants 1,3 to 5

NOTICE

To,
R-4: Gurajada Meenakshi, W/o. late Hemachandra Charyulu, D.No.16-3-20, Katika Veedhi, Vizianagaram.
R-5: Smt. Patnala Amrutha Valli, W/o. Kameswara Rao, Rest -do-
R-7: Smt. Nakka Naga Srivalli, W/o. Venkata Ramana, D.No.16-3-20, Katika Veedhi, Vizianagaram.

Please take notice that the above-named petitioner/2nd defendant filed the above I.A. against Respondents to set aside the exparte order against him in the above F.D.I.A. and the said I.A. stands posted to **28-12-2023** for your appearance. Therefore, you are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **28-12-2023 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

P. V. RAJAGOPAL,
Advocate,Visakhapatnam.
Cell: 9848265456.